క్లుప్తంగా

ముస్లింలకు ఆసిఫ్ రంజాన్ శుభాకాంక్షలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా తోటి ముస్లిం సోదరులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో భక్తికి, దాతృత్వానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. సమాజంలో శాంతి వర్ధిల్లాలని, ప్రజలందరూ సమభావంతో జీవించాలని ఇస్లాం చెబుతుందన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు చేకూరాలని అల్లాను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తోడుగా నిలుస్తుందని, ఆ భగవంతుని ఆశీస్సులతో జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో తిరిగి అధికారాన్ని చేపట్టాలని ఆకాంక్షించారు.

అలరించిన భక్తి గానలహరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన కళ్యాణి ద్విభాష్యం, అభిజ్ఞ ఆలపించిన భక్తి గానలహరి భక్తులను విశేషంగా అలరించింది. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై బుధవారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల అనంతరం భక్తి గీతాలను ఆలపించారు. వీరికి విజయనగరానికి చెందిన ప్రవీణ్ కీబోర్డు, హైదరాబాద్‌కు చెందిన భూయేష్ తబలా, జగన్మోహిని మృదంగంపై చక్కటి సహకారం అందించారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న గానలహరిని భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

బైక్ ఢీకొని టీ వెండర్‌కు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు రోడ్డు ఆర్‌సీఎం స్కూల్ ప్రాంతానికి చెందిన ఎ. తులసీరావు ఫ్లాస్కులో టీ పెట్టుకుని షాపులకు అమ్ముతూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో టీ తీసుకుని చిట్టినగర్ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ వచ్చి ఢీ కొట్టింది. దీంతో తులసీరావుకు కుడికాలు మోకాలు వద్ద గాయమైంది. వెంటనే తులసీరావును 108లో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాయిదాలకు హాజరుకాని నిందితుడికి రిమాండ్

ఉంగుటూరు: అక్రమంగా గంజాయి రవాణా కేసులో నిందితుడిని ఆత్కూరు పోలీసులు అరెస్ట్ చేసి విజయవాడ ఎంఎస్‌ఏ సెషన్స్ కోర్టులో బుధవారం హాజరుపరచినట్లు ఎస్‌ఐ పైడిబాబు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ వివరాలను వెల్లడి చేశారు. గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉన్న తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన రవిశంకర్ ఏడాది నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. దీంతో న్యాయమూర్తి అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. ఆత్కూరు పోలీసులు మధురై వెళ్లి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడికి 14రోజులు రిమాండ్‌కు విధించారు.

విద్యుదాఘాతంతో స్వీపర్‌కు గాయాలు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆర్టీసీ డిపోలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లి బీకాలనీకి చెందిన సాలి మేరిమ్మ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తోంది. కార్యాలయాన్ని శుభ్రం చేస్తుండగా కరెంట్ వైర్లు ఆమె కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురైంది. అక్కడున్న వారు ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి 108 వాహనంలో చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శివకామేశ్వరీ అమ్మవారికి అష్ట గంధంతో పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో బుధవారం వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వ ర్యాన గంధం, అష్ట గంధంతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

ప్రతి ఇంటికీ పెద్ద బిడ్డగా సీఎం జగన్

- 46వ డివిజన్‌లో అపూర్వ స్వాగతం పలుకుతున్న ప్రజలు
- జగనన్న సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయానికి బాటలు
- ఎన్నికల ప్రచారంలో మేయర్ భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత



మిల్క్ ప్రాజెక్ట్ సమీపంలో 48వ డివిజన్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ పెద్ద బిడ్డగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన అందించిన సంక్షేమం, అభివృద్ధి కారణంగానే వెళ్లిన చోటల్లా ప్రజలు తమకు అపూర్వ స్వాగతాన్ని పలుకుతున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లకు మద్దతుగా 46వ డివిజన్ పరిధిలోని కొండ ప్రాంతాల్లో వారిద్దరూ బుధవారం ప్రచారం నిర్వహించారు. తొలుత చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకున్న కేశినేని శ్వేతకు పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. మేయర్ భాగ్యలక్ష్మి, శ్వేత మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేటీ రోడ్డు మీదుగా పాదయాత్ర చేసుకుంటూ 46వ డివిజన్ భీమన వారి పేటకు చేరుకున్నారు. మార్గమధ్యలో రోడ్లపై చిరు వ్యాపారులు, మహిళలను కలుసుకుని వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. కొండ ప్రాంతానికి చేరుకున్న వారికి ఇంటింటి నుంచి అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా మేయర్ భాగ్యలక్ష్మి, కేశినేని శ్వేత మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ముంగిటకు పాలనను తీసుకువచ్చారన్నారు. పార్టీలు, ప్రాంతాలు, కుల, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా చేసి చూపించారన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ గుంపుగా చేసి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకుండా చూడాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజలందరూ ఆ కుట్రలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీగా విజయవాడలో పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసిన కేశినేని నానికి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. విజయవాడ అభివృద్ధికి చంద్రబాబు సహకరించకపోయినా కేంద్రంలో ఉన్న సంబంధాలతో కేశినేని నాని రూ.8 వేల కోట్లతో విజయవాడను అభివృద్ధి చేశారన్నారు. కనకదుర్గ గుడి ఫ్లై ఓవర్, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్, వెస్ట్ బైపాస్, తిరువూరు బైపాస్‌లను అందించిన ఘనత కేశినేని నానిదేనన్నారు. ప్రజా సేవలో అవినీతి మచ్చ లేని ప్రజా సేవకులైన కేశినేని నాని, షేక్ ఆసిఫ్‌లను ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. రియల్ స్కామ్‌లు చేసే నాయకులందరినీ విజయవాడకు తీసుకువచ్చి, కోట్లాది రూపాయలు తీసుకుని టికెట్లు ఇస్తున్నారన్నారని, అటువంటి వారు గెలిస్తే విజయవాడ ఫర్ సేల్ అని బోర్డులు పెడతారన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట

బడుగు, బలహీన వర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మేయర్ భాగ్యలక్ష్మి అన్నారు. బీసీ వర్గాలకు చెందిన ప్రజలకు రాజ్యాధికారాన్ని ఇచ్చే సంకల్పంతో సామాన్యులైన ఆసిఫ్, మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావులకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం ఇచ్చారన్నారు. పెత్తందారులపై యుద్ధానికి సామాన్యులతో వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, కార్పొరేటర్లు ఆంజనేయరెడ్డి, చైతన్యరెడ్డి, కోటిరెడ్డి, మైలవరపు రత్నకుమారి, మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, అబ్దుల్ అర్షద్, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, యలకల చలపతిరావు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి మెహరాజ్, రాయన నరేంద్ర, నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు విజిత, పిళ్లా సూరిబాబు, దిద్దుకూరి శివలతో పాటు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఈద్గాలో ఈద్ నమాజుకు ఏర్పాట్లు



ఈద్గాలో సామూహిక ప్రార్థనల నిమిత్తం చేసిన ఏర్పాట్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ మోతీ మసీదు (ఈద్గా)లో గురువారం ఉదయం 10–30 గంటలకు సామూహిక ప్రార్థనలు జరుగుతాయని కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ బాషా , సెక్రటరీ పఠాన్ అక్బర్ ఖాన్ తెలిపారు. ఈద్గాలో నిర్వహించే సామూహిక ప్రార్థనలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈద్గాలో ఉదయం 10 గంటలకు మోతీ మసీదు ఇమామ్ నజీర్ అహ్మద్ ఖురాన్‌లోని పలు అంశాల గురించి వివరిస్తారు. ఉదయం 10–30 గంటలకు సామూహిక ప్రార్థనలు జరుగుతాయి. ఈద్గా ఆవరణలో ప్రార్థనలు చేసుకునేందుకు అవసరమైన స్థలంలో షామియానాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రార్థనలకు విచ్చేసే ముస్లింల కోసం మంచినీటి సదుపాయం, షామియానాలలో కూలర్లు అందుబాటులో ఉంచామని కమిటీ పేర్కొంది. ప్రత్యేక ప్రార్థనల సమయంలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కేటీ రోడ్డులో పెట్రోల్ బంక్ నుంచి చిట్టినగర్ జంక్షన్ వరకు ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సీఎం జగన్ ప్రభుత్వంలో మైనార్టీలకు ప్రాధాన్యం

పశ్చిమ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్న ఆసిఫ్, ముస్లిం పెద్దలు, ముస్లిం నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా విద్యాధరపురంలోని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎమ్మెస్ పంజాతన్ రహిహక్ ఫౌండేషన్ అధ్యక్షుడు బషీరుల్లా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ముస్లిం మైనార్టీలతో కలిసి పశ్చిమ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి పండ్లు ఇచ్చి రంజాన్ మాస దీక్షను విరమింప చేశారు. అనంతరం విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానాలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు పవిత్రంగా చూసుకునే గ్రంథం ఖురాన్ ఉద్భవించింది రంజాన్ మాసంలోనేనని, అందుకే ఈ మాసానికి అంత ప్రాధాన్యం ఉందని తెలిపారు.

బీజేపీతో చంద్రబాబు పొత్తు సిగ్గుచేటు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం పెరిగిందని ఆసిఫ్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముస్లింల ప్రాతినిధ్యం పెంచేందుకు ఏడుగురు ముస్లిం మైనార్టీలకు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అవకాశం కల్పించారని చెప్పారు. చంద్రబాబు ముగ్గురికి మాత్రమే టికెట్లు ఇచ్చారని, దానినిబట్టి ముస్లిం మైనార్టీల పట్ల ఎవరికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. నాడు విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చి వారి జీవితాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వెలుగులు నింపారని గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లను వ్యతిరేకించిన బీజేపీతో చంద్రబాబు పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. అటువంటి చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పటం ఖాయమని, జగనన్నను వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హయాత్, జీఎంసీ బాషా, మైలవరపు దుర్గారావు, ఆకుల శ్రీనివాస్ కుమార్, వడ్లాని మాధవరావు, తోలేటి శ్రీకాంత్, బొమ్ము మధు, భవానీపురం దర్గా ముజావర్ల కమిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్, జీఎంసీ అల్తాఫ్, సుభాని, ఇక్బాల్, ఖాజా, జిలాని, యూసఫ్, సుభాన్ ఖాన్, మీరా బాబా, యాసిన్, పఠాన్ కరీం ఖాన్, గౌసీ, అజీజ్, మీర్ హుస్సేన్, ఇమామ్, హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

పేదోడిని.. ఆశీర్వదించి గెలిపించండి

- మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు
- గొల్లపూడిలో ఎన్నికల ప్రచారం



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న తిరుపతిరావు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): సామాన్యుడిని..పేదవాడినైన తనను ఆశీర్వదించి గెలిపించండి. తద్వారా ప్రజా సేవ చేసుకునే భాగ్యం కల్పించండి అని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. బుధవారం సాయంత్రం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని దర్గా దళితవాడలో ఆయన పర్యటించారు. హారతులిచ్చి స్వాగతం పలికిన మహిళలు తమ మంచి నీటి కొరత తీర్చాలని విజ్ఞప్తి చేశారు. గొల్లపూడి సాయిపురం కాలనీలో నూతనంగా వాటర్ ఫిల్టర్ బెడ్ నిర్మిస్తున్నామని, త్వరలో తాగు నీటి సమస్య పరిష్కారమవుతుందని తిరుపతిరావు వారికి హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మించి ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లు అందరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి పేదల పక్షపాతి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, ఇక్కడ స్థానిక ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన తాము జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని స్థానికులు ముక్తకంఠంతో చెప్పారు. ముఖ్యంగా తమ సొంత ఇంటి కల నెరవేర్చిన జగనన్న ప్రభుత్వాన్ని కాకుండా మరొకరిని గెలిపించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

వలంటీర్లపై విషం కక్కిన చంద్రబాబును నమ్మకండి..

గడిచిన నాలుగన్నరేళ్ల నుంచి వలంటీర్ వ్యవస్థపై విషం కక్కిన చంద్రబాబు ఇప్పుడు వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలు చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందని, అతని మోసపు మాటలను నమ్మవద్దని సర్నాల తిరుపతిరావు అన్నారు. గోనె సంచులు మోస్తున్నారని చంద్రబాబు, ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారని పవన్ కల్యాణ్ ఇలా అనేక అసత్య ఆరోపణలతో మానసిక క్షోభకు గురి చేసిన వారిని వలంటీర్లు నమ్మే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు, అతని దత్తపుత్రుడు చేసిన అనుచిత వ్యాఖ్యలతో మనస్తాపం చెందిన వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేసి తిరుగుబాటు చేయడంతో వారికి దిమ్మ తిరిగి బొమ్మ కనబడిందని, దాంతో ఇప్పుడు వారిపై ప్రేమ ఒలకబోస్తూ కొత్త రాగం అందుకున్నారని ఎద్దేవా చేశారు. జూన్ 4న జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, వలంటీర్లు మళ్లీ ప్రజలతో మమేకమై సేవలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్, గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో రంజాన్ సందడి



రంజాన్ పండుగకు ముస్తాబైన వన్ టౌన్ లోని షాహి మసీదు



వన్ టౌన్ లో హలీం సెంటర్ల వద్ద జనాల రద్దీ

చివరి రోజు భారీగా తరలివచ్చిన ముస్లింలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ మాసం ముగింపు సందర్భంగా బుధవారం వన్‌టౌన్‌లోని పలు మసీదులు కిటకిటలాడాయి. వన్‌టౌన్‌లో వందలాది మంది ముస్లింలు బుధవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. గురువారం రంజాన్ కావడంతో వించిపేట, తారాపేట, ఇస్లాంపేట, పాతబస్తీ తదితర ప్రాంతాల్లోని మసీదులన్నీ భక్తులతో కళకళలాడాయి. ఈ సందర్భంగా వించిపేటలోని షాహీ మసీదు ప్రాంగణంలో వందలాది మంది ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. అలాగే బాబూ రాజేంద్రప్రసాద్ రోడ్డులోని మినార్ మసీద్, వించిపేటలోని చిన్నమసీదు తదితర ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పంజా సెంటర్ కిటకిట

రంజాన్ ముగింపు కావడంతో వన్‌టౌన్‌లో మసీదుల పరిసరాలు బుధవారం సాయంత్రం సందడిగా మారాయి. ముఖ్యంగా వించిపేట పంజా సెంటర్ తదితర ప్రాంతాల్లో ముస్లింలు సందడిగా తిరుగుతూ కనిపించారు.

హుండీ కానుకల లెక్కింపు

తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని రామలింగేశ్వరాలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఏడు నెలలకు గాను రూ.లక్షా 16 వేల 284 ఆదాయం లభించిందని ఆలయ మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ పాలకవర్గ చైర్మన్ తిరుమలశెట్టి వేణుబాబు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ

తిరువూరు: ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నగదు రవాణాను అరికట్టేందుకు తిరువూరు సర్కిల్‌లోని తెలంగాణ సరిహద్దు గ్రామాలలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరువూరు మండలం రాజుపేట, విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టులలో రికార్డులను పరిశీలించారు. వాహనాల తనిఖీ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ భార్గవ, సీఐ నాగవల్లి, తిరువూరు ఎస్ఈబీ ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలో రంజాన్ వేడుకలు

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం ఎంపీపీ పాఠశాలలో బుధవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా విద్యార్థులకు సేమియా ప్యాకెట్లు పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. 30 రోజులు పాటు ఉపవాస దీక్షలు చేయడం ద్వారా ఆకలి విలువ తెలుస్తుందన్నారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, విద్యా కమిటీ చైర్మన్ నూర్జహాన్, ఉపాధ్యాయులు అనూరాధ, భవానీ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో బాలిక అదృశ్యం అయిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన బాలిక (16)ఇటీవల పది పరీక్షలు రాసింది. ఆమెను హాస్టల్‌లో పెడతామని తల్లిదండ్రులు తెలిపారు. కాగా మంగళవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

మాలలు చంద్రబాబును ఎన్నటికీ నమ్మరు

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలలకు తీరని అన్యాయం చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ అన్నారు. మాలలు ఎన్నటికీ చంద్రబాబును నమ్మరని ఆయన అన్నారు. నగరంలోని మాచవరంలో బుధవారం చందా కిరణ్‌తేజ మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల కిందట కొందరు స్వార్థపరులైన మాల నాయకులు చంద్రబాబును కలవడం వారి దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. నాడు మాలల పంతం ..చంద్రబాబు అంతం అన్న వారే నేడు వెళ్లి ఎలా కలిశారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలలకు అన్ని రకాలుగా మేలు చేశారని, మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్రంలోని మాలలంతా ఎదురు చూస్తున్నారని కిరణ్‌తేజ అన్నారు. మాలలు వైఎస్సార్ సీపీకి అండగా నిలుస్తారని, చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదన్నారు. పేద వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు జగన్ దోహదపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

రెడ్డిగూడెంలో ఇఫ్తార్ విందు



రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చినపల్లి గ్రామంలో బుధవారం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి రంజాన్ తోఫాను అందజేశారు. అలాగే రెడ్డిగూడెంలో మతగురువు మౌతాసీమ్ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, మండల పార్టీ కన్వీనర్ బలగాని తిరుపతిరావు, వివిధ విభాగాల నాయకులు ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, బత్తుల శ్రీనివాసరెడ్డి, బత్తుల వెంకటేశ్వరరెడ్డి, ఉయ్యూరు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.